


పరుగిడుతున్న 'ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌ని' ఖంగారుగా అందుకొని ఎక్కింది 'రతీదేవి'. ఆమె చేయి పట్టు జారిపోతోం దని గ్రహించి ద్వారం దగ్గరే నిలబడి వున్న 'రాధేయ'- చప్పున ఆమె చెయి పట్టుకొని పైకి లాగాడు

అతనలా లాగటంలో అతని గుండెల దాకావచ్చిన రతీదేవి... బిడియంగా, ఖంగారుగా, తలెత్తిచూసి... నిశ్చేష్టురాలైంది. అప్పుడామెను పరీక్షగా చూసిన రాధేయకూడా ఆశ్చర్యంగానూ, సంభ్రమంగానూ చూశాడు. చప్పున కాస్త పక్కకు జరిగి నిల్చుంది రతీదేవి.

"మీరు...మీరు...రతి కదా...?"

ఆనందంతో రాధేయ పెదవులు అరుణిమ దాల్చాయి। జవాబుకూడా చెప్పే స్థితిలో లేదామె. అతని నక్కడ సడన్‌గా చూడటం వలన కలిగిన ఆనందమో, బాధో, ఆశ్చర్యమో, ఉద్వేగమో, వివశత్వమో... ఆమెకే బోధపడటంలేదు.

'మై...గాడ్।... రాధేయ...ఇన్ని సంవత్సరాలకు ఇలా' అని మాత్రమే మనస్సులో పదేపదే, మూగగా అనుకుంటోంది.

ద్వారం దగ్గరున్నది ఆ ఇద్దరే కాదు। ట్రైను బాగా రష్‌గాఉండడంతో, ద్వారం దగ్గర చాలామంది నిలబడే వున్నారు. అందువలన, అతనితో మాట్లాడాలంటే మరింతగా ముడుచుకుపోతోంది రతీదేవి.

"కాదని చెప్పాలనుకుంటున్నావు కదూ?..." చిన్నగా నవ్వుతూ అడిగాడు రాధేయ. చివ్వున తలెత్తి చూసింది.

"మైగాడ్...। ఇంత వయసొచ్చినా ... ఇంకా... ఆ అలవాటు పోలేదు।" మనస్సులో చిన్నగా గొణిగాడు. అతను గొణిగిందేమిటో, మిగతా వారికి అర్థం కాకపోయినా రతీదేవికి అర్థమైంది.

"గుంటూరుదాకానా?..." స్మైల్ చేస్తూ అడిగాడు రాధేయ.

రతీదేవి ఉలిక్కిపడి, 'అవు'నంది. "అవ్వా।..." అతని చూపులు సూటిగా కలవటంతో, చప్పున తల దించుకుంది.

"రిజర్వేషన్ చేయించుకోకూడదూ।" అభిమానంగా అన్నాడు. రతీదేవి మాట్లాడలేదు.

చుట్టూ అందరూ తమనే కుతూహలంగా గమనిస్తున్నారని గ్రహించి, ఇక 'రాధేయ' మౌనం వహించాడు. తుని రాగానే, ఆ పెట్టె, పెట్టె ఖాళీ అయిపోయింది. బహుశా వాళ్ళందరూ తునిలో ఏదో పెళ్ళికి హాజరవుతున్నారని అనుకున్నాడు రాధేయ వాళ్ళు లేవగానే చప్పున సీటు ఆక్రమించి, రతీదేవినికూడా పిలిచేడు. మౌనంగా వచ్చి...అతని పక్కన కూర్చుంది.

ఆమె ముడుచుకొని కూర్చోవటం చూసి— "ఫ్రీగా కూర్చో రతీ।..." అంటూ, విండోపక్కకు బాగా జరిగి, ఆమెకు చోటిచ్చాడు.

కాసేపు ఇద్దరూ... విండోలోనుండి బయటకు చూస్తూ కూర్చున్నారు. రతీదేవి అతనిని దొంగచూపులు చూస్తూనే వుంది. చివరకు రాధేయే ఆ మౌనాన్ని ఛేధించాడు.

"ఏదైనా పనివుండి వస్తున్నావా?" చిన్నగా అడిగాడు. "మారేజి కొస్తున్నాను" ముభావంగా జవాబిచ్చింది.

"ఎవరిది...?" మరల అడిగాడు.

"హేమంత కూతురు మారేజి కొస్తున్నాను।" సౌమ్యంగానే జవాబిచ్చింది.

"హేమ... కూతురు మారేజా?..." ఆశ్చర్యంగా తనలో తను గొణుక్కున్నాడు. అతనివైపు పరిశీలనగా చూస్తున్న రతీదేవి నుద్దేశించి— "మీ

వారు, పిల్లలు, బాగున్నారా?" గంభీరంగా అడిగాడు.

తను త్రుళ్ళిపడ్డట్లు అతను గ్రహించకుండా— "బాగానే వున్నారు..." చిన్నగా నవ్వుతూ చెప్పింది.

"అదృష్టవంతురాలివి..." ఈర్ష్యగా పలికాడు.

"మారేజి చేసుకున్నావా?" రతీదేవి కూడా అడిగింది.

"ఊఁ..." అన్నాడు రాధేయ. ఇంకేవో అడగాలనుకొని కూడా అడగలేకపోయింది రతీదేవి

మరల కాసేపు ఇద్దరి మధ్య 'నిశ్శబ్దం' రాజ్యమేలింది. "మీరూ మన ఊరేనా...?" ఈసారి రతీదేవి పలకరించింది.

"ఊఁ.. " చిన్నగా తలవూపాడు. "మీరూ ఎందుకు? 'రాధా' అని పిలవలేవా...?" నొచ్చుకుంటూ అడిగాడు. రతీదేవి మాట్లాడలేదు.

"మాట్లాడవేం రతీ...?" మార్దవంగా అడిగాడు రాధేయ. "మనం అప్పటి చిన్నపిల్లలం కాదుగా...!" వినీ, వినపడనట్లుగా అంది.

"చిన్నపిల్లలైతేనే పేర్లతో పిలుచుకోవాలా? పెద్దవాళ్ళెవరూ పేర్లతో పిలుచుకోవటంలేదా ...?" అతని గొంతులో కాస్త 'విస్మయం'ధ్వనించింది.

"పిలుచుకోవచ్చు"...!

"మరి...?" ప్రశ్నార్థకంగా చూశాడు రాధేయ.

"ప్లీజ్...! ఈ కాసేపైనా సరదాగా, వెనుకటి రతిలా మాట్లాడు"- రాధేయ గొంతులో వేడికోలు! అతని వైపు విభ్రాంతిగా చూసింది- రతీదేవి.


"ప్లీజ్! అలా చూడకు. నేను తట్టుకోలేను. నీకా విషయం తెలుసు..." తలొంచుకొని కోరాడు. ఒక్క నిమిషం రతీదేవి గుండె 'లయ' తప్పింది.

"ఒంటరిగా ఏళ్ళ తరబడి చాలినన్ని నీళ్ళులేక, ఎదురుచూసే ఎస్కిమో జాతి మొక్కకు, స్వాతి చినుకుల సౌగంధం చల్లగా సోకినట్లుగా ఉంది ప్రస్తుతం ఆమె పరిస్థితి కూడా. అప్పుడలా 'లయ' తప్పటం... భావ్యంకాదని ఆమెకు తెల్సు! కానీ... పురివిప్పిన నెమలి నాట్యాన్ని ఎవరాపగలరు...?"

ఇంతలో-రాజమండ్రి స్టేషనొచ్చింది. అక్కడ ఒక పదినిమషాలు ట్రైనాగింది. రాధేయ దిగివెళ్ళి పళ్ళూ, టిఫిన్ పొట్లాలు తీసుకొచ్చి సీటుమీద పెడుతూ- "కాఫీ తాగుతావా"...? సరళంగా అడిగాడు.

"ఇతనికి ఎంత గుర్తు...?" మనస్సులో అనుకుంటూ, అతని వైపు ప్రేమగా చూస్తూ-"వద్దు రాధా"! అంది. ఆమెకు తెలియకుండానే, ఆమె నోటి వెంట వచ్చిన ఆ తీయని పిలుపు రాధేయ గుండెల్లో గులాబీలను పూయించింది.

"థాంక్ యు రతీ...! థాంక్ యు వెరీమచ్...!" ఆమె అరిచేతిని సున్ని




తంగా స్పృశించి వదిలాడు. అతని స్పర్శ తగలగానే... ఆమె శరీరం రోమాంచితమయింది.

"కాఫీ నిజంగా వద్దా...? అప్పటి ఆ అలవాటు ఇంకా అలాగే ఉందా...?" విస్మయంగా అడిగాడు రాధేయ. "ఉందన్నట్లు" నవ్వుతూ తలవూపింది.

"అచ్ఛా..." సంతోషంతో ఉచ్ఛరించాడు. "నీ అలవాటూ మారలేదుగా?" నవ్వుతూ అంది. ఆమె నవ్వుల పువ్వుల్ని చాలినన్ని ఏరుకొని. కేరుకొని చూశాడు.

"టిఫిన్ తీసుకో...!" వడల పొట్లం విప్పి, ఇద్దరి మధ్య పెట్టాడు. "హాయ్.. వడలా...?" పెద్దగా అరవబోయి కంట్రోల్ చేసుకుంది రతీదేవి. ఆమె అవస్థకు నవ్వొచ్చింది.

ఒక వడను చేత్తో తీసుకొని, నోటి దగ్గర పెట్టుకోబోయి, ఆగి చూశాడు. అతని భావం అర్థమై, తలొంచుకొంది.

రెండు నిమిషాలలాగే చూసి, తుంచి నోట్లో పెట్టుకొని- "తిను!" గంభీరంగా అన్నాడు తలొంచుకునే తిన్నది రతీదేవి.

"పళ్ళు కూడా తీసుకో...!" సున్నితంగా హెచ్చరించాడు. వాటి వైపే చూస్తోంది. రాధేయ విసుగ్గా వాటినందుకున్నాడు. "నేను వలుస్తానుండు...!" బంగారుగా అని, కమలాలను చేతిలోకి తీసుకుంది. ఆమె వైపు 'మైమరపు'గా చూశాడు. దాంతో, ఆమె తల మరింతగా భూమిలోకి క్రుంగిపోయింది.

"నిన్ను... చూస్తుంటే కొత్త... పెళ్ళి—" ఇంకా ఆ వాక్యాన్ని పొడిగించబోయి తక్కున ఆపేశాడు. అతని వైపు చిరుకోపంగా చూపింది. నవ్వుతూ ఆమె వలిచిన కమలాపండును తీసుకుని తిన సాగాడు.

"తింటూ కబుర్లు చెప్పు ...?" నవ్వుతూ హెచ్చరించాడు రాధేయ. "ఏం కబుర్లు చెప్పను...!"

"నువ్వు చెప్పాలనుకుంటే కబుర్లే లేవా? మీరెక్కడ ఉంటున్నారో, మీవారేం చేస్తుంటారో, మీ పిల్లలేం చదువుతున్నారో, మీవారి కబుర్లు... ఇలా...ఇంకా, ఇంకా... ఎన్నో చెప్పవచ్చు..." ఆమె పమిటవైపు కొంత పరీక్షగా చూస్తూ అన్నాడు.

"ఆ కబుర్లేవో నువ్వు చెప్పరాదూ?" కోపంగా ఉంది రతీదేవి స్వరం. "బాగుంది! మీవారి కబుర్లు నేనెలా చెప్పగలను...?" చిన్నగా నవ్వాడు రాధేయ.

"ఫూలిష్‌గా మాట్లాడకు. నే నడుగుతున్నది మీ ఆవిడ కబుర్లు..." అలా కోపంగా అంటున్న రతీదేవిని కన్నార్పకుండా చూస్తున్నాడు. చప్పున మాగ్జయిన్‌ని చేతుల్లోకి తీసుకొని, మొహాన్ని అందులో దాచుకుంది రతీదేవి.

"అవన్నీ చెప్పకపోతేమాల్లే...! ఎక్కడుంటున్నావో. పోనీ అదైనా చెబుతావా...?"

"చెబితే ఏం చేస్తావ్...?" విసురుగా అంది.

"వచ్చి విన్ను, మీ ఫామిలీని చూసి, సంతోషిస్తాను...."

"థాంక్స్...!" విసురుగా చెప్పింది. "మరీ అంత విసురుకోకు! కళ్ళజోడు జారిపోతే కష్టం..." చిలిపిగా నవ్వాడు. "ఈ కళ్ళజోడు పగిలితే మరో కొత్తది కొనగలరులే మావారు..." హేళనగా అంది రతీదేవి.

"చాలా సంతోషం...!" గమ్మత్తుగా నవ్వాడు

వీళ్ళిలా మాట్లాడుకుంటుండగానే— 'విజయవాడ' కూడా వచ్చింది. అక్కడ మీల్స్‌కి దాదాపు ఒక అరగంట ఆపారు. భోంచేయనని చెప్పింది రతీదేవి. తనకూ తినాలనిపించక, ఒక క్రీమ్ బిస్కట్ పాకెట్ కొనుక్కొచ్చాడు రాధేయ.

"చిన్నపాపాయిలా ఈ తిండేమిటి?" బిస్కట్ అందిస్తున్న రాధేయతో అంది. "నాకు నువ్వెప్పుడూ చిన్న పాపాయిలాగే అనిపిస్తావు రతీ! అందుకే తెచ్చాను..." ఆమె వైపు ఆరాధనగా చూస్తూ అన్నాడు. ఆమె గుండె లోతుల్లో సన్నగా 'హిందోళం' పలుకుతోంది! బిస్కట్ త్రుంచి నోట్లో పెట్టుకుంటుంటే, పెదవులు అదిరాయి! మెల్లగా కళ్ళెత్తి అతని వైపు చూసింది.

ఆమె చూపు 'శశికిరణం'లా చల్లని స్పర్శను కల్గించింది రాధేయకు.

ట్రైను గుంటూరు చేరేదాకా, ఒకరిని ఒకరు మూగగా చూసుకుంటూ కూర్చుండిపోయారు.

గుంటూరులో దిగి- అక్కడ నుండి బస్సులో వాళ్ళు చేరవల్సిన పల్లెకు చేరేసరికి, రాత్రి ఏడయింది. బస్సు దిగి,

ఊళ్ళోకి జంటగా నడుస్తుంటే, అదో వింత స్పందన, గగుర్పాటు...!

ఇద్దరి దారులు వేరుకాబోతున్న ఒక మలుపు దగ్గర...ఇద్దరూ తమకు తెలియకుండానే ఆగిపోయారు. మరల జీవితంలో కలుసుకుంటామో, లేదోనన్న బాధ...! ఒకరితో ఒకరు ఏదో చెప్పాలన్న ఆరాటం, ఆర్తి....! కానీ.. పెదాలు కదలటంలేదు.

ఆదమరచి నిద్రపోతుండగా– సడన్‌గా ఓ కడలి కెరటం ఉవ్వెత్తున ఎగిసి వచ్చి.... ముంచేసినట్లుగా...ఇద్దరి అంతరంగాలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి.

"వస్తా రతీ...!" బరువుగా ధ్వనించింది రాధేయ స్వరం.

"ఎందుకొచ్చినట్లు...?" దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ, అప్పుడడిగింది.

ఆమెవైపు విస్మయంగా చూస్తూ– "ఏవో 'నోటు' విషయాలు సరిచేయటానికొచ్చానులే..." అన్నాడు.

'మరల ఎప్పుడు ప్రయాణం...?' అని అడగాలని వున్నా అడగలేకపోయింది రతీదేవి.

"శెలవా... మరి...!" ప్రక్కకు తిరిగి అన్నాడు రాధేయ. "ఊఁ..." అంటూనే.. ముందుకు కదిలింది. ఇంకా అక్కడుంటే, తన పరిస్థితేమిటో తనకు తెల్సు! దూరమవుతున్న ఆమె మూర్తిని చూస్తూ, కళ్ళు తుడుచుకున్నాడు రాధేయ.

* * *

రతీదేవిని చూసి హేమంత చాలా సంతోషించింది. "నువ్వు వచ్చినందుకు నాకెంత ఆనందంగా వుందో చెప్పలేనే రతీ....!" చుట్టుకుపోయి అంది.

నిన్ను చూడాలనే వచ్చాను హేమూ.." ఆర్తిగా పలికింది. "థాంక్స్ రతీ...!" కృతజ్ఞతా భావంతో చూసింది హేమంత

"ఏమిటే...అలా చూస్తున్నావ్..?" ఇబ్బందిగా కదిలింది రతీదేవి. "ఏం లేదు...!అడవిగాచిన వెన్నెలైపోతున్న నీ అందాన్ని చూస్తున్నాను"... బాధగా అంది హేమంత.

"హే...మూ...!" కంపించింది రతీదేవి స్వరం. "నిజం రతీ...! నిన్నిలా చూస్తుంటే, నాకు చాలా బాధగా ఉంది! పెద్దవాళ్ళ మూర్ఖత్వానికి నీ జీవితం నిర్దాక్షిణ్యంగా బలైపోయింది, పాపం...! ఇక ఆ రాధేయ ఎక్కడున్నాడో? ఏమో? నీలాగే అతనూ శాపగ్రస్తుడు. అతని అడ్రసు తెలియదు కానీ... మొత్తానికి పెళ్ళి చేసుకోలేదని మాత్రం విన్నాను, అడ్రసు తెలిస్తే, తప్పక అతనికీ వెడ్డింగ్‌కార్డ్ పంపించేదాన్ని..." బాధగా అంటోంది హేమూ.

"మొత్తానికి పెళ్ళి చేసుకోలేదని విన్నాను!" ఆ ఒక్క వాక్యమే విన్నది రతీదేవి. ఇక ఆ తర్వాత మాటలు ఆమె చెవిలో దూరలేదు.

నెత్తిమీద పిడుగులు పడ్డట్లు వణికి పోయింది. గుండెల్లో సప్తసముద్రాల ఘోష...!! పొట్టలో ప్రేవులు చుట్టుకు పోతున్నట్లు... నరకం...

"అరే...! ఏమిటే... అలా తూలి పోతున్నావ్...?" ఖంగారుగా వచ్చి పట్టుకుంది హేమంత.

"అబ్బే...! ఏం... లేదే...? జర్నీ చేసొచ్చాను కదూ...! కాస్త నీరసంగా ఉందంతే..." నీరసంగా పలుకుతూ, హేమంత అసరాతో మంచం మీద పడుకుంది.

వేడివేడి పాలు తెచ్చి ఇచ్చింది ప్రేమగా హేమంత. అవి త్రాగాక కాస్త శక్తివచ్చినట్లయింది. కానీ—మనస్సులో మాత్రం సముద్రఘోషే...!


'మైగాడ్...! రాధేయ... కూడా మారేజ్ చేసుకోలేదా...? అతడి... కుటుంబ... బాధ్యతలు అతన్నింకా అవివాహితుడిగా మిగిల్చాయా..? లేక... తనను... తనను మర్చిపోలేకనే... అలా ఉన్నాడా...? అతని కళ్ళలోని మెరుపులు చూసి... తన కనుమానం వచ్చి కూడా. అతను భార్యా, బిడ్డలున్నా ననేసరికి... ఏమీ అడగలేకపోయింది. ఇంత వయసొచ్చినా, తనలాగే అతను కూడా ఆనాటి ప్రేమను, అనుభూతుల్ని మర్చిపోలేకపోతున్నాడా...? లేక... స్నేహభావంతో అలా బిహేవ్.... చేశాడా...?.

'ఇప్పుడు తనకు నలభై మూడేళ్ళు. అతనికి అపై మరో రెండు ఉంటాయి. అయినా— అతన్ని చూడగానే కన్నె పిల్లలా తన 'గుండె' అలా కొట్టుకుం దేమిటి? అక్కడక్కడ వెంట్రుకలు కూడా తెల్లబడుతున్నాయి కదా! మరి— అతని స్పర్శ సోకగానే— తన శరీ రంలో ఆ 'అలజడి' ఏమిటి—? చూపు సరిగ్గాలేక తన కళ్ళకు కళ్ళజోడు వచ్చింది కదా—! అయినా— అతని చూపులతో చూపులు కలవగానే సిగ్గుతో అలా వాలిపోతాయేం—? అతను నవ్వ గానే— తన శరీరం మొత్తం అలా స్పందిస్తుందేమిటి—? ఇంత కాలమైనా ఇంత వయసొచ్చినా— తన మనస్సుకు, 'మరపు' రాలేదన్నమాట! అయితే, ఇంతకాలం మర్చిపోయినట్లు అందర్నీ నమ్మిస్తూ, తనను తను వంచించుకుంటూ బ్రతికిందన్న మాట—!' ఆలోచనలలో కొట్టుకుపోతోంది రతీదేవి.

* * *

హేమంత కూతురుపెళ్ళి వైభవం గానే జరిగింది. హేమంత ఎన్నోసార్లు అతని ప్రస్తావన తెచ్చినా, అతను కూడా తనతోనే కల్సి వచ్చాడని మాత్రం ఎందుకో చెప్పలేకపోయింది రతీదేవి.

ఇక వెళ్తానని బయల్దేరింది. "ఈ ఒక్కరోజు ఉండవే—! రేపు నాకు తెరిపిగా ఉంటుంది. కొస్త సరదాగా మాట్లాడుకోవచ్చు—" బ్రతిమాలి. రతీ




దేవి ప్రయాణాన్ని ఆపింది హేమంత. ఆ స్నేహితురాలి మనస్సు నొప్పించలేక ఆగిపోయింది.

సాయంత్రం హేమంత ఏదో పని హడావుడిలో వుండిపోయింది. ఒక్కదానికీ ఏం తోచక, బయటకు నడిచింది. ఆమెకు తెలియకుండానే... ఆమె కాళ్ళు ఆ ఊరి శివాలయం వైపుకు మళ్ళాయి।

శివాలయాన్ని సమీపిస్తుంటే—ఆమె గుండె ఉద్వేగంతో కొట్టుకోసాగింది। మనస్సులో ఎన్నో భావాలు ముప్పిరి గొన్నాయి మూకుమ్మడిగా.

ఆమె శివాలయంలోకి ప్రవేశించేసరికి, సందెచీకట్లు అప్పుడే కాస్త అలుము కుంటున్నాయి। దర్శనం చేసుకుంది. పూజారి తీర్థప్రసాదాలిచ్చాక, మెల్లగా ఆలయం వెనుకభాగంలోనున్న కోనేరు దగ్గరకు నడిచింది. అక్కడ కూర్చొబోయి. చప్పున వెనుదిరిగింది

"ర— తీ—!" ఆ పిలుపుకు బొమ్మలా నిలబడిపోయింది.

"ఇటొచ్చి కూర్చొ రతీ...!" అతని పిలుపు— లోకంలోని ప్రేమానురాగాలన్నింటినీ గొంతులో నింపుకొని పిలిచినట్లుగా ఉంది.

"నువ్వు వస్తావని అనుకోలేదు"—। అతని గొంతులో రవ్వంత నిష్ఠూరం। ఆమె మాట్లాడలేదు.

"మాట్లాడవేం రతీ"—?

"ఏం మాట్లాడాలి"—? విల్చనే అడిగింది. "హేమా కూతురి పెళ్ళి బాగా జరిగిందా—?" మామూలు—స్వరంతోనే అడిగాడు.

"మీరొస్తారని అనుకున్నాను—!" అతనికి కాస్త సమీపంలో చతికిలబడుతూ అంది.

"పిలవని పేరంటానికి ఎలా వస్తానను కున్నావ్—?"

"నేను చెప్పాను కదా—! కనీసం హేమాని చూడటానికైనా వస్తారను కున్నాను—" చిన్నగా అంది. అతను గమ్మత్తుగా నవ్వుతూ— "నువ్వు చెబితే హేమా వచ్చి తప్పక నన్నాహ్వా నిస్తుంది. అప్పుడు రావాలనుకున్నాను. కానీ— నువ్వసలు చెప్పందే— హేమా కెలా తెలుస్తుంది—? నేను రావటం నీ కసలిష్టం లేదేమోలే అని వూహించాను —" దెప్పుతున్నట్లుగా అన్నాడు రాధేయ. రతీదేవి కోపంగా చూసింది. కాని— చీకట్లో ఒకరి మొఖం లోని భావాలు, మరొకరికి స్పష్టంగా కన్పించటంలేదు.

విసురుగా లేవబోయింది రతీదేవి. చప్పున ఆమె భుజంమీద చెయ్యేసి, ఆపాడు. సీరియస్‌గా చూసింది.

"ఓ— సారీ—!" నొచ్చుకుంటూ చెయ్యి తీశాడు. అతనలా చెయ్యి తీయకుండా, లోగడలోలాగా తన మొహాన్ని అతని మొహానికి చేర్చుకొని పెదాలతో చెక్కిళ్ళను ముద్దాడితే బాగుండ ననిపించింది రతీదేవికి. కాని మరు క్షణమే తన ఊహకు భయపడింది.

'ఛీ— ఛీ—! తన మనస్సిలా అదుపు తప్పుతున్న దేమిటి—?' తనను తానే తిట్టుకుంది.

ఇద్దరూ మోకాళ్ళ మీద తలలు దించుకొని— మౌనంగా కూర్చున్నారు. గత స్మృతులు ఒకేసారి ఇద్దరినీ ముప్పిరి గొన్నాయి. రతి పూర్తిగా ఆ స్మృతుల లోకి జారిపోయింది.

* * *

ఒకరి చేతులొకరు పట్టుకొని స్కూలుకెళ్ళటం, మధ్యలో ఏదో ఒక ఉపాయంతో స్కూలునుండి బయటపడి శివాలయం యొక్క వెనుక భాగానికి చేరి ఆటలాడటం—పూజారి పెట్టే ప్రసాదం తినటం— కరెక్టు టైముకి— ఇంటికి చేరి తాయిలం చేజిక్కించుకొని, మరల ఆటలకు బయల్దేరటం— తల్లి చీవాట్లు— ఓహ్...!

ఆ తర్వాత హైస్కూలు చదువు—! ఇద్దరూ పోటీలుపడి చదవటం, క్లాసు రూములో దొంగచూపులు చూసుకోవ టం, నోట్ పుస్తకంలో తన బొమ్మగీసి చాటుగా అందించటం, తనేమో రాత్రుళ్ళు ఆ బొమ్మల్ని చూసి మురిసిపోవటం, మరునాడు స్కూల్లో లాస్ట్ అవర్ కనుక 'లీజర్' అయితే, మెల్లగా అక్కడనుండి

జారుకొని స్కూలు వెనుక భాగాన ఉన్న చింతతోపుల్లో చేరి, కబుర్లాడుకోవటం. రాధేయ చిలిపిగా ఏదో ఒకటి అని ఏడిపించటం... తను అలిగి విసురుగా అక్కడినుండి లేవబోవటం— అప్పుడతను పమిటపట్టి లాగి— కొంటెపనులు చేయటం— తను ఇష్టంలేనట్లు నటిస్తూనే ఇష్టపడటం—అబ్బ...! అవన్నీ ఎంత మధురక్షణాలు...!

ఆ తర్వాత ఇద్దరూ పట్నంలోని కాలేజీలో చేరటం — విడివిడిగా ఒకరు హాస్టల్‌లోనూ, మరొకరు రూము తీసుకొని ఉన్నా, ప్రతిరోజూ సాయంత్రం ఇద్దరూ పార్కులో కలుసుకొని ఎన్నెన్ని కబుర్లో...! బ్రతుకును పండించుకోవటానికి— ఎన్నెన్ని— ఆశలు— ఆశయాలో....? రాధేయ కమలాలు వచ్చే సీజన్‌లో అయితే, డజను పళ్ళకు తక్కువ ఎప్పుడూ కొని తెచ్చేవాడు కాదు పార్కుకు. మొదట అవంటే తన కిష్టంలేకపోయినా— రాధేయకు ఇష్టం కనుక— తనూ ఇష్టపడేది తన వడిలో వాలి అతను పడుకుంటే. తనేమో ఆ కమలాలు వలిచి పెదాలకు తొనలందించేది. మధ్య మధ్యలో అతనూ అందిస్తూ వుండేవాడు. అలా ఒక్కోసారి ఎన్ని కాయలు తినేవారో ఇద్దరికీ తెలిసేది కాదు—.

తను ఇంటి దగ్గర కాఫీ తాగేది. కానీ కాలేజీలో చేరాక, రాధేయతో కల్సి షికార్లు చేయటం ఎక్కువ అయ్యాక, కాఫీ తాగటం తక్కున మానేసింది. అతనికి కాఫీ అంటేనే ఎలర్జీ! అది తెలిసి తనూ పూర్తిగా మానేసింది. శెలవులకు ఇంటికెళ్ళినప్పుడు... ఇంట్లో వాళ్ళంతా ఎంత ఆశ్చర్యపోయారో—?

ఆర్థిక ఇబ్బందుల వలన— ఒక ప్రక్క నలిగిపోతూ కూడా, తనను సంతోషపెట్టటం కోసం— ఎంత 'హుషారు' నటించేవాడో? మల్లెలొచ్చే సీజనులో అయితే దాదాపు ప్రతిరోజూ అతను తెచ్చే మల్లెలు తన జడను అలంకరించేవి. ఆ పూలు కొనటంకోసం, అతనొక పూట భోజనం మానేస్తున్నాడని ఆ తర్వాత తెల్సి— తనెంతగా బాధపడిందో? తనేడుస్తుంటే... బుగ్గల మీదకు జారిన ఆ కన్నీటిని రాధేయ పెదాలు స్పృశిస్తుంటే— తను నిలువునా చలించిపోయింది—

"నువ్వు జీవితంలో అసలు కంటతడి పెట్టకూడదు రతీ...! నీ కన్నీటిని నేను చూడలేను"— అని ఆర్తిగా అంటున్న అతన్ని— తను ప్రేమోద్రేకంతో హత్తుకుపోతే— "రతీ డియర్! మై స్వీట్ హార్ట్!— మై లవ్...!" అంటూ వివశురాల్ని చేశేవాడు.

డిగ్రీ చేతికి రావటానికి ఇంకో ఆర్నెల్లు వుండగా... తమ వ్యవహారం తనవాళ్ళకు, వాళ్ళవాళ్ళకు తెలిసి పెద్ద రాద్ధాంతం చేశారు. ఎన్నెన్నో బంగారు

కలలుగంటూ— పూలతేరులా సాగి పోతున్న తమ ప్రయాణం ఒక్కసారిగా దీనంగా మారిపోయింది.

'చదువొద్దు—! గిదువొద్దంటూ—!' తిట్టి, ఎదురు తిరిగితే నానారకాలుగా హింసించి, ఇంటికి తీసుకొచ్చి పడేశారు. కులంలోను, ఆస్థిలోను, అంతస్థులోను కూడా తక్కువలో ఉన్న... రాధేయను అతడి కుటుంబ సభ్యుల్ని కూడా... 'మా అమ్మాయి జోలికొస్తే తాట వలుస్తామని...' చెప్పి బెదిరించారు రాక్షసుల్లాంటి తన తండ్రి, అన్న కూడా, తనను ఇంట్లోనే పెట్టి బయటకు రానివ్వకుండా కాపలా కాశారు. అప్పుడు తను, రాధేయ, ఎంత గిలగిల్లాడిపోయారో... ఆ భగవంతుడికి, తామిద్దరికీ మాత్రమే తెల్సు.


రెండు, మూడుసార్లు తామిద్దరూ రహస్యంగా కలుసుకోవాలని ప్రయత్నించి...ఇద్దరూ కూడా చావుదెబ్బలు తిన్నారు. చివరికెలాగైతేనేం... తనకు బాగా 'తెగింపు' వచ్చి, ఒక అర్ధరాత్రి చేతికందిన డబ్బు, నగలు తీసుకొని ఇంట్లోనుండి బయటపడింది. ఎంతో ఆశతో అతన్ని చేరి, 'పారిపోదామని' అడిగితే...అప్పుడీ రాధేయ ఎన్ని చచ్చు కబుర్లు చెప్పాడు... తన ఆశలన్నింటినీ సమూలంగా నాశనంచేసిన పిరికివాడు. అప్పుడు తన గుండె ఎంతగా మండిపోయిందో...? 'ఇక జన్మలో నీ మొహం చూడనని' అసహ్యంగా పలికి ఇంటికొచ్చి, తల్లిదండ్రుల దృష్టిలో ఒక బజారు స్త్రీగా మిగిలిపోయింది.

ఆనాడు అతను పలికిన ప్రతి మాట తనకిప్పటికీ బాగా గుర్తే! 'రతీ—! అంత తొందరపడి వచ్చావ్...! ఇప్పుడిలా మనం పారిపోతే మనల్నేమంటారో తెల్సా"—? లేచిపోయారంటారు' తను కసిగా పల్కింది.

'మరి తెలిసే ఎలా వచ్చావ్? వెళ్ళి ఎలా బ్రతుకుతాం...? పెద్దల ఆశీస్సులు లేకుండా, మనం సుఖపడగలమనే అనుకుంటున్నావా...? పైగా మన ఇద్దరికీ కూడా ఉద్యోగాలు లేవు. వద్దు రతీ...! ప్లీజ్...వెళ్ళిపో...! నాకేం నేను మగవాడ్ని! నువ్వు ఆడపిల్లవు, నలుగురూ హేళనచేస్తుంటే నువ్వు తట్టుకోలేవు. నిన్నలా చూస్తూ—నేనూ తట్టుకోలేను. నా మాట విని... వెంటనే వెళ్ళిపో— రతీ—!' అలా పిరికిగా మాట్లాడి... బలవంతంగా పంపించివేశాడు. లేకపోతే ఈపాటికి హేమూలా తాము కూడా తమ కూతురికి వివాహం చేసేవారు ...

'తమ బిడ్డకు వివాహం చేయవల్సిన ఈ వయస్సులో— తానిప్పుడు— ఈ త్రుళ్ళిపడటం ఏమిటి? తన మనస్సులో— ఈ గగుర్పాటేమిటి...?' ఒక్కసారిగా తలను గట్టిగా విదిలించింది రతీదేవి.

"తలను విదిలించినంత మాత్రాన, ఈ పిడికెడు గుండె చేసే 'గలభా




తగ్గుతుందా రతీ...?" అతని ప్రశ్నతో విస్తుపోయింది.

ఇక అక్కడ ఉండలేనట్లు పైకి లేచింది. "వెళ్తున్నావా...?" అడిగాడు రాధేయ.

"ఊఁ"—

"నువ్వు— నువ్వు—" ఏమో అడగబోయి మరల సందేహించి— "ఏం లేదులే...! జాగ్రత్తగా వెళ్ళు!" మెల్లగా అన్నాడు.

'అతను ఇంకేదైనా అడిగితే బాగుండు'నుకొంది రతీదేవి. కానీ— అతనేమీ అనకపోయేసరికి, నిర్లిప్తంగా- కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి చేరింది.

"ఎక్కడికి వెళ్ళావే...? హడలిపోయాను" హేమంత ఖంగారుగా అంది.

"ఏం తోచక, అలా గుళ్ళోకెళ్ళాను లే—!" విసుగ్గా చెప్పి, మంచం మీద వాలిపోయింది రతీదేవి మానసిక స్థితి నూహించుకొని జాలిపడింది హేమంత.

ఎలిమెంటరీ స్కూలు చదువునుండి హైస్కూలు చదువుదాకా— హేమంత కూడా రతీదేవికి మంచి మిత్రురాలే. అయితే, ఆమె స్కూలుఫైనల్ మధ్యలోనే ఆపేసి, బుద్ధిమంతురాలిలా పెళ్ళి కూతురైంది. రాధేయ, రతీ ఏమో స్కూలుఫైనల్ పూర్తిచేసి, కాలేజీలో చేరారు.

* * *

ఎంత నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపోయింది—? కనీసం 'నువ్వూ వస్తావా రాధా—?' అని కూడా అడగలేదంటే, ఎంత కర్కశ హృదయ మనుకోవాలి? ఆనాడు పారిపోవటానికి ఆమె వస్తే ముందు కోప్పడి, ఆ తర్వాత నచ్చజెప్పి ఇంటికి పంపించినందుకా— ఈ కోప

మంతా—? ఆమె బాగు కోరేకదా— ఆనాడు అలా ప్రవర్తించింది...! ఆ మాత్రం అర్థంచేసుకోలేకపోతే ఎలా? ఆమె సుఖానికి అడ్డుపడి— తానేమైనా 'స్వార్థం చూసుకున్నాడా—? అదేం లేదు కదా—! రతిని ఏనాటికైనా గెల్చుకోవాలన్న తపనతోనే కదా అష్టకష్టాలు పడి చదివి, పెద్ద హోదాకు చేరాడు. కానీ— అప్పుడేమైంది—?"

'రతికి వీలయినంత త్వరలో పెళ్ళి చేయాలని పట్టుబట్టి వాళ్ళవాళ్ళు సంబంధాలు చూస్తే— తామిద్దరి ప్రేమ విషయం తెలిసి అన్నీ తప్పిపోవటంతో వాళ్ళు ఆ అవమానం భరించలేక, ఆ ఊరొదిలి వెళ్ళిపోయారని తెల్సి తానెంత కుమిలిపోయాడు-? ఎన్ని సంవత్సరాలు ఆమె కోసం అన్వేషించి, అన్వేషించి— విద్రలేని నిశిరాత్రులు ఎన్ని గడిపాడో ఎవరి కర్థమవుతుంది...? ఏ దేవుడూ తన మొరాలకించలేకపోయాడు-! పైగా చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, తమ్ముళ్ళ చదువులు— తలకు మించిన బాధ్యతల సుడిగుండంలో నిర్దాక్షిణ్యంగా కూరుకుపోయాడు. ఆ బాధ్యతలన్నింటినీ వదిలించుకునేసరికి- వయస్సు ప్రొద్దుగుంకింది. అయినా... తన కళ్ళు ఎక్కడున్నా తన 'హృదయ రాణి' జాడకోసం వెదుకుతూనే వుండేవి. ఇంత కాలానికి- మరల ఇలా కనిపించింది రతి. అయితే- ఆమెకు వివాహమై తనను, తన జ్ఞాపకాల్ని మర్చిపోయి వుంటుందని భావించాడు. ట్రైనులో ఆమెను ప్రవర్తనను చూసి, కానీ... నిన్న... శంకరం బాబాయి చెప్పిన విషయం విని— తానెంత ఆశ్చర్యపోయాడో?—'

'రతికి పెళ్ళి కాలేదు' అనే విషయం విన్నప్పుడు తనకొకవైపు ఆనందం, మరొకవైపు బాధ- గుండెను విచిత్రంగా మెలిపెట్టాయి.

'మైగాడ్! రతి కూడా అవివాహితగా ఎందుకుండిపోయింది?— తనలాగే.... మనస్సును చంపుకోలేకనే అలా మిగిలిపోయిందా? మరి— మరి— భర్త గురించి, పిల్లల గురించి అడిగినపుడు— అలా చెప్పిందేమిటి—?

'అలా చెప్పక—ఎలా చెప్తుందిలే! తను మాత్రం— ఎలా చెప్పాడు కనుక—?'

'ఒకవేళ— తనకూడా పెళ్ళి కాలేదని తెలిస్తే— ఏం చేస్తుందో...? ఇక్కడికొచ్చాక ఎవరో ఒకరు చెప్పకుండా ఉన్నారా...? ఎవరు చెప్తారులే? హేమంతకు తెలుసో, లేదో—? తెలిస్తే మాత్రం చెప్పాలని రూలుందా? ఒకవేళ ఆమె చెప్పినా—రతి ఏమంటుందని తన ఉద్దేశ్యం—? ఏమిటో! తన పిచ్చి—' ఆలోచిస్తూ, బంధువుల యింటికి చేరాడు రాధేయ.

* * *

రాధేయ టిక్కెట్ తీసుకొని, గబ

గబా ప్లాట్‌ఫారమ్ దగ్గరకు వచ్చేసరికి, అక్కడ సూట్‌కేస్‌తో నిలబడి వుంది రతీదేవి. ఆమెను చూడగానే. అతని కన్నులు కాంతిపుంజాలయ్యాయి.

'రతి కూడా మరల ఈ ట్రైనుకే ప్రయాణిస్తుందా? విన్న 'నీ వెప్పుడు వెళతావని?' అడగనందుకు— ఎంత దిగులుపడ్డాడో! 'కల్సి వెళ్దామని' ఒక్క మాట అనలేకపోయానే అని ఎంతగానో తనను తాను నిందించుకున్నాడు. హేమంత ఇంటికి వెళ్ళి అడగాలన్నంత కోరిక కల్గింది. కానీ— అందుకు అభిమానం అడ్డొచ్చి, ఉస్సూరుమని నిట్టూర్చాడు.

'ట్రైనులో మరల ఎప్పుడైనా ఇద్దరం కల్సుకుంటామో లేదో'నని— ఎంతగానో విచారించాడు. కాని-అడగందే వరాలిచ్చే దేవతలా-ఇప్పుడు, ఇక్కడ ప్రత్యక్షమైన రతిని చూస్తుంటే... ఓహ్! ఈ ఆనందాన్ని ఎలా భరించను? జీవితంలో ఇంతవరకు ఇంతటి ఆనందాన్ని తను చవిచూసి ఎరుగడు. తన గుండె ఇంత వేగంగా ఎప్పుడూ కొట్టుకోలేదు.

'మానససరోవరంలో ఈతలు కొట్టినట్లుగా వుంది! పారిజాతం తన సుగంధాన్ని అందిస్తూ కులుకులొలుకుతున్నట్లుగా వుంది.'

"నువ్వూ ఈ ట్రైనుకేనా..." చనువుగానే పలకరించింది రతీదేవి.

ఆమె పలకరింపుతో ఆలోచనలకు, భావస్పందనకు 'బ్రేక్' పడింది.

ఆమె కళ్ళల్లోకూడా నిగూఢంగా దాగివున్న ఆనందం తాలూకు 'మెరుపులు' కొద్దిగా కనపడ్డాయి.

"అవును రతీ—!" ఆప్యాయంగా చూస్తూ చెప్పాడు సమాధానం.

"ఎక్కడిదాకా—?" మరల అడిగింది రతీదేవి.

"భువనేశ్వర్ వెళుతున్నాను—!" అతని గొంతు బరువుగా ధ్వనించింది.

"నువ్వు వుండటం అక్కడా...?" ఆమె కళ్ళల్లో అంతులేని ఆశ్చర్యం!

"ఊఁ—" చిన్నగా తల ఊపాడు రాధేయ. ఆమె కళ్ళెందుకో...దిగులుగా, నిస్పృహగా, కిందకు వాలిపోయాయి.

ఇంతలో - ప్లాట్‌ఫారమ్ మీదకు ట్రైనొచ్చింది! చనువుగా రతీదేవి చేతిలోని సూట్‌కేస్‌నికూడా అందుకొని, చప్పున ఎక్కేసి, ఆమె ఎక్కటానికి, చేయందించాడు. సంకోచించకుండా అతని చేతినందుకొని ఎక్కేసింది. సీట్లు చూసుకొని ఇద్దరూ పక్కపక్కనే ఆనుకొని కూర్చున్నారు. ఇద్దరూ అలా సన్నిహితంగా కూర్చుంటే ఇద్దరి మనస్సుల్లోనూ ఆనందమే చోటుచేసుకుంది.

"ఏమైనా బుక్స్ తెచ్చేదా?" ఆప్యాయంగా చూస్తూ అడిగాడు. 'వద్దన్నట్లు' తలవూపింది

వాళ్ళిద్దరూ భార్యాభర్త అనుకొని ఎదురుగా కూర్చున్న ఒక పెద్దామె— "ఎక్కడిదాకా వెళ్తున్నారమ్మా?" అని అడిగింది. ఇద్దరికీ ఏం చెప్పాలో అర్థం గాక, ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

ఆమెకు సమాధానం చెప్పకుండానే "మీ రెక్కడివరకూ వెళ్తున్నారని?" అడిగాడు రాధేయ ఉపాయంగా.

"వైజాగ్" అని చెప్పిందామె. "అలాగా" అని వూరుకున్నాడు. ఆమె విస్తుపోతూ చూసింది. చప్పున తల దించుకుంది రతీదేవి.

ట్రైను బయల్దేరింది. ట్రైను బయల్దేరటంతోనే ఆమె నిద్రకుజోగింది. "అమ్మయ్య"...! అని ఇద్దరూ మనస్సులో అనుకున్నారు.

రతీదేవి వైపే కన్నార్పకుండా చూస్తున్నాడు రాధేయ. అతనలా సూటిగా, నిర్భయంగా చూస్తుంటే బాగా ఇబ్బందిగా ఫీలవుతూ— "ఏంటలా చూస్తున్నావ్...?" వినీవినపడనట్లుగా గొణిగింది.

"ఏంలేదు! నీ జుట్టు తెల్లబడలేదు. అందుకే 'ఈర్ష్యగా' చూస్తున్నాను...!" తన క్రాఫ్‌ని సవరించుకుంటూ అన్నాడు రాధేయ.

"భలేవాడివే...!" పెద్దగా నవ్వింది. చాలా రోజుల తర్వాత ఆమె నవ్వును అలా చూస్తుంటే- రాధేయ గుండె... ఉప్పొంగింది! చప్పున ఆపేసింది రతీదేవి

"ఎందుకలా ఆగిపోయావ్...?" కాస్త నిరుత్సాహంగా అడిగాడు. సమాధానం చెప్పలేదు రతీదేవి.

"మాట్లాడు రతీ"...! అతని గొంతులో వేడికోలు...! అయినా కూడా మాట్లాడలేకపోయింది రతీదేవి ఎందుకో ఇక రెట్టించలేదు రాధేయ కూడా. అలాగే మూగగా వుండిపోయారు ఇద్దరూ.

"రాధా...!" ఉన్నట్లుండి పిలిచింది రతీదేవి. మెరుస్తున్న కళ్ళతో చూస్తూ. "ఏమిటి...?" అన్నాడు.

"అబ్బే—! ఏంలేదు...! ఊరికే పిలిచానంతే...!" తడబడింది. నవ్వి వూరుకున్నాడు రాధేయ.

మరి కొంతసేపయ్యాక ఈసారి రాధేయ పిలిచాడు.

"ఏం... లేదు...! మీ పేరెంట్స్ అంతా బాగున్నారా...?" ఒకటి అడగా లనుకొని మరొకటి అడిగాడు. "ఇందుకేనా నువ్వు పిలిచింది...?" కాస్త కోపంగానేచూసింది రతీదేవి. సమాధానం చెప్పలేక తలదించుకున్నాడు. ఆ తర్వాత మరల మౌనం...

రాజమండ్రి దాటగానే ఏదో విస్మృతివ ఆక్రమించినట్లుగా— రాధేయ భుజం మీదకు వరిగిపోయింది రతి. వెంటనే కళ్ళు మూతలుపడ్డాయి. చల్లని దేవత కరుణించినట్లుగా, హాయిగా అతని

భుజంమీద... తల వాల్చుకొని నిద్ర పోయింది రతీదేవి. ఆమె నడుం చుట్టూ చేయి బిగించి, ఆప్యాయంగా ఇంకా స్త తన దగ్గరకు లాక్కొని, తనూ కళ్ళు మూసుకున్నాడు రాధేయ. చిత్రంగా అతనికీ నిద్రపట్టేసింది.

ట్రైను వైజాగ్ చేరేదాకా, ఇద్దరికీ— మెలకువే రాలేదు.

ఏవో అరుపులు, హడావుడీ— వినిపించి మూతలు పడుతున్న కళ్ళను బలవంతంగా తెరిచి, తానెలా వున్నదో చూసుకొని— గుండె కొట్టుకుంది. సిగ్గుతో ఆమె హృదయం— చితికి పోయింది! మెల్లగా విడిపించుకోవటానికి ప్రయత్నించటంతో, రాధేయ కూడా బంగారుగా కళ్ళు తెరిచిచూసి విస్తు పోయాడు. చప్పున దూరం జరిగాడు.

"వై-జా-గొచ్చి-ంది—!" రతీదేవి స్వరం పేలవంగా వుంది.

"వెళ్ళాలా—?" అతని గొంతులో చెప్పలేని నిరాశ!

'వెళ్ళాలన్నట్లు—' మూగగా తల వూపింది. ఆమెకు గుండెల్లో మంది దుఃఖం తన్నుకొస్తోంది.

"సరే పద—! ఈ దీనుడ్ని ఇక్కడే మర్చిపోయి- హాయిగా ఉండు—!" గద్గద స్వరంతో అంటూ ఆమె సూట్ కేస్‌ని చేతిలోకి తీసుకున్నాడు.

ఇద్దరికీ పెళ్ళి కాలేదని ఇద్దరికీ తెలుసు— కానీ— ఎవరికి వారే తెలియనట్లు నటించారు. కనీసం శేషజీవితమైనా కలిసి పంచుకుందామని— అడగాలని ఇద్దరికీ వుంది. కానీ— తీరా అడిగాక ఎవరికి ముందు ఆశాభంగమవుతుందోనని భయపడి వూరుకున్నారు.

'ఆనాడు అర్ధరాత్రి వచ్చి- 'నన్ను స్వీకరించమని కోరితే' అంత అవమానం చేశావే!...మరీనాడు నే నెలా ఒప్పుకుంటాననుకున్నావ్? ఆ విషయాన్ని నువ్వు మరచినా— నేను మర్చిపోలేదు' అని రతీదేవి ఆగ్రహం చూపిస్తే, తట్టుకోలేనేమోనని రాధేయ అడగటానికి భయపడ్డాడు.

ఆనాడు- 'జన్మలో నీ మొహం చూడనని' అతనితో శపథం చేసి, పిరికివాడని గేలిచేసి- మరల ఇప్పుడు అతని వద్ద ఆ ప్రస్తావన తీసుకురావటానికి— సంకోచించింది రతీదేవి. స్త్రీ సహజమైన బిడియం కూడా ఆమె గొంతును నొక్కివేసింది. అంతేకాదు. మరో కారణం కూడా వుంది.

'ఈ వయస్సులో మనకిక పెళ్ళా?' అని అతను గేలిచేస్తాడేమోనని కూడా జంకింది. ఇలా ఇద్దరూ ఎవరికి వారే... భయపడి మౌనం వహించారు.

బరువైన హృదయాలతో, నీరసించిన శరీరాలతో ఇద్దరూ ట్రైను దిగారు. కానీ...ఇద్దరికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

"ర—తీ—!" అతని గొంతు

వణికింది, తడికళ్ళతో చూపింది రతీదేవి.

"నేనిక ముందుకు రాలేను. దయచేసి పోర్టర్‌ని సాయం తీసుకొని బయటికి వెళ్ళు. ఇప్పుడు కనుక నీతో ముందుకు వస్తే... నేను వెనక్కి రాలేనేమో—! నాకా శక్తి లేదు నన్ను క్షమించు—"

"రా—ధా—!" ఆమె కళ్ళు జల జల వర్షించాయి.

"చాలు రతీ...! ఈ బ్రతుక్కి ఈ వరం చాలు—! థాంక్ యు రతీ—! థాంక్ యు వెరీమచ్!... ఐ లవ్ యు రతీ!— ఎవర్, ఎవర్ షల్ ఐ లవ్ యు రతీ! గుడ్‌బై మై లవ్— గుడ్‌బై!—" ఆమె సూట్‌కేస్‌ని కిందకు జారవిడిచి, ఆమె రెండు అరిచేతుల్ని దగ్గరకు లాక్కొని, అందులో ముఖం దాచుకున్నాడు. రతీదేవి అరిచేతులు అతని కన్నీటిధారలతో తడిసిపోతున్నాయి.

అక్కడ చాలామంది జనం ఉన్నారన్న విషయమే గుర్తు లేదు వాళ్ళిద్దరికీ కూడా.

ఇంతలో— ట్రైను కదలబోతున్న అలికిడి వినిపించి— "గుడ్‌బై రతీ!" అని మాత్రమే అనగలిగి, పరిగెత్తినట్లుగా వచ్చి ట్రైనెక్కాడు రాధేయ.

అతను వెళ్తున్నప్పుడు— తనుకూడా 'ఐ లవ్ యు రాధా! ఐ వాంట్ యు రాధా—! ఎక్కడున్నా, ఎలా ఉన్నా ఎవర్, ఎవర్ షల్ ఐ లవ్ యు!" చెప్పాలని ఎంతగానో ప్రయత్నించింది రతీదేవి. కానీ... ఆమె గొంతు పెగిలితేగా—?

ట్రైనెక్కుతున్న రాధేయను చూస్తుంటే— ఆమె గుండె పగిలిపోతున్నట్లుగా వుంది. కళ్ళు కన్నీటి సెలయేళ్ళు అయ్యాయి.

పరిగెత్తబోతోంది ట్రైను. ఇక తనను తాను కంట్రోల్ చేసుకోలేకపోయింది రతీదేవి. పిచ్చిబలంతో పరిగెత్తి ట్రైన్‌ని కాచ్ చేసింది. సూట్‌కేస్ విషయం ఆమె కసలు గుర్తేలేదు.

గుండెల్నికోస్తున్న బాధతో పిచ్చి చూపులు చూస్తు కూర్చున్న రాధేయ— "వచ్చాను రాధేయా—! నీ కోసమే వచ్చాను రాధేయా — నేనూ నీతోనే చివరిదాకా ప్రయాణిస్తాను రాధేయా!— నన్ను త్వరగా పట్టుకో! నాకు కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి! ప్లీజ్—"

ఉలిక్కిపడి, ఒక్క అంగలో ద్వారాన్ని సమీపించి, పడిపోబోతున్న రతీదేవిని గుండెలకు చేర్చుకొని, పదిలంగా ఆమెను సీటు దగ్గరకు తీసుకొచ్చి- ఆమెతో సహా సీటు మీదకు ఒరిగిపోయడు. ఆమె శిరస్సు అతని వడిలో వుంది. ఆర్తిగా, ఆబగా, ఆమె నుదురు చుంబించసాగాడు. ఆ దృశ్యం చూస్తున్న మిగతా ప్రయాణీకులు విస్తుపోయారు. ఆ ఆనందాన్ని భరించలేనట్లు అతని కళ్ళు వర్షించసాగాయి! ఆ ట్రైను ఆ ఇద్దర్నీ జతగా తీసుకొనీ ఆనందతీరాలకు పరుగులు పెడ్తోంది.